జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 19 | జూన్ | 2026 ◆ పేజీలు : 8


## మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం



**చర్ల , జూన్ 18 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని నారాయణ్ పూర్ జిల్లా మస్పూర్–గుద్రపాల్ అటవీ ప్రాంతంలో నిర్వహించిన గాలింపు చర్యల్లో భద్రతా దళాలు భారీ విజయాన్నిసాధించాయి.మావోయిస్టులు అడవిలో దాచిపెట్టిన ఆయుధాలు,మందుగుండు సామగ్రి,ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేసేందుకు పోలీసులు, భద్రతా దళాలు నిరంతరం ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో జూన్ 16న బీఎస్ఎఫ్ 133వ బెటాలియన్ కు చెందిన 'ఈ' కంపెనీ సిబ్బంది

మిగతా 2 లో...

- కేసు నమోదై నెల రోజులు గడుస్తున్నా చర్యలు ఎక్కడ..?
- మైనర్ బాలికకు న్యాయం చేయడంలో జాప్యంపై ప్రశ్నలు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడనే ఆరోపణలు
- బాధిత కుటుంబం ఆవేదన.. అధికారుల తీరుపై అసంతృప్తి
- దర్యాప్తులో రాజకీయ నాయకుల ఎంట్రీపై కొత్త అనుమానాలు




## ఫోక్సో కేసులో...
# జాప్యం ఎందుకు..?

8 లో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో నమోదైన ఫోక్సో కేసు వ్యవహారం రోజురోజుకూ మరింత చర్చనీయాంశంగా మారుతోంది. మైనర్ బాలిక పట్ల ఒక సూపర్ మార్కెట్ యజమాని అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణలపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినప్పటికీ నెల రోజులు గడుస్తున్నా దర్యాప్తు పురోగతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై తీసుకున్న చర్యల విషయంలో స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఘటన అనంతరం వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు అందజేశారు. కేసు నమోదు అయినప్పటికీ ఆ తర్వాత దర్యాప్తు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసులో కూడా ఇప్పటి వరకు స్పష్టమైన ఫలితాలు కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

● కొత్తగూడెం / పాల్వంచ, ప్రజాజ్యోతి

## కిన్నెరసానిలో వన మహోత్సవానికి శ్రీకారం



- జిల్లాలో 55 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం
- వర్చువల్ గా వన మహోత్సవాన్ని ప్రారంభించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి
- కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిది - ఎమ్మెల్యే కూనంనేని

**పాల్వంచ, జూన్ 18, ప్రజాజ్యోతి:** రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హరిత కార్యక్రమాలతో పాటు కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే

మిగతా 2 లో...

## బీఆర్ఎస్ సమావేశం
# బహిరంగ వేదికపై వర్గపోరు

- కొత్తగూడెం క్లబ్ లో రసాభాస.. రవీందర్ – రాఘవ వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత
- కుర్చీలు విరగ్గొట్టి నిరసన.. నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణం.. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎంపీ వద్దిరాజు రంగంలోకి



**కొత్తగూడెం, జూన్ 18 ( ప్రజాజ్యోతి ):** బిఆర్ఎస్ పార్టీ బలోపేతం,సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటు లక్ష్యంగా నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం చివరకు వర్గపోరుకు వేదికగా మారింది. కొత్తగూడెం క్లబ్ లో గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్, వనమా రాఘవకు

మిగతా 2 లో...

# ఆరేళ్ల నిరీక్షణకు తెర..

- మల్లారం శివారుకు విద్యుత్ వెలుగులు
- 80 కుటుంబాలకు కరెంట్ సౌకర్యం కల్పించేందుకు స్తంభాల ఏర్పాటు



**దమ్మపేట, జూన్. 18, (ప్రజాజ్యోతి ):** దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలోని మల్లారం శివారులో సుమారు 80 కుటుంబాలు ఆరు సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు.దమ్మపేట కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, పగడాల రాంబాబు, కక్కిరాల రమేష్ తదితరులు ఇటీవల విద్యుత్ శాఖ ఏఈ సమక్షంలో

మిగతా 2 లో...

## మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం



(మొదటి పేజీ తరువాయి...)

మస్పూర్ క్యాంపు నుంచి సమీప అటవీ ప్రాంతాల్లో విస్తృత గాలింపు నిర్వహించారు. గాలింపు సందర్భంగా మస్పూర్–గుద్రపాల్ అడవిలో అనుమానాస్పద ప్రదేశాన్ని గుర్తించిన భద్రతా దళాలు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా అక్కడ దాచిపెట్టిన ఆయుధాల డంప్ ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఒక స్వదేశీ బీజీఎల్ లాంచర్, ఏడు బీజీఎల్ గన్స్, ఒక 12 బోర్ రైఫిల్, 37 రౌండ్ల మందుగుండు సామగ్రి, 15 మీటర్ల వైర్, ఐదు పౌచ్ లు ఉన్నాయి. ప్రాథమిక విచారణలో ఈ ఆయుధాలను గతంలోనే అటవీ ప్రాంతంలో దాచిపెట్టినట్లు తెలిసిందని అధికారులు వెల్లడించారు. భద్రతా దళాల అప్రమత్తతతో ఈ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు అని అధికారులు అన్నారు. మార్చి 31, 2026న నారాయణ్ పూర్ జిల్లాను నక్సల్ రహిత జిల్లాగా ప్రకటించినప్పటికీ, గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా మరిన్ని ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలియచేసారు.

## కిన్నెరసానిలో వన మహోత్సవానికి శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి...)

కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు, ట్రెక్కింగ్ సౌకర్యం, బటర్ ఫ్లై పార్క్, జింకల పార్కులో ఫీడింగ్ షెడ్, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే, కలెక్టర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిదని పేర్కొన్నారు. కిన్నెరసానిని రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తీగల వంతెన, అద్దాల మేడ, జూ పార్క్, బోటు షికారు, పర్యాటక హోటల్ వంటి ప్రాజెక్టులను చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే కొత్తగూడెం పట్టణానికి రూ.500 కోట్లతో రింగ్ రోడ్డు, భారీ ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 50 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందని తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించామని, ఇందుకు 42 శాఖలకు బాధ్యతలు కేటాయించినట్లు చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నాటిన మొక్కల్లో కనీసం 95 శాతం వృక్షాలుగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 8 లక్షల ఎకరాల అటవీ భూమి ఉందని, అటవీ సంపద పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం సఫారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ వజ్జా రామకృష్ణ, అదనపు కలెక్టర్ విద్యాచందన, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రకృతి ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సమావేశం బహిరంగ వేదికపై వర్గపోరు





(మొదటి పేజీ తరువాయి...)

సంబంధించిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీయగా కార్యకర్తల ఆగ్రహంతో సభా ప్రాంగణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. సమావేశం ప్రశాంతంగా సాగుతుండగా రవీందర్ ప్రసంగంలో వనమా రాఘవ అంశం ప్రస్తావనకు రావడంతో పరిస్థితి మారిపోయింది. రాఘవకు పార్టీ సస్పెన్షన్ రద్దు కాలేదని సభ్యత్వం కూడా ఇంకా ఇవ్వలేదని చేసిన వ్యాఖ్యలపై రాఘవ అనుచరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సభా ప్రాంగణంలోనే నినాదాలు మొదలయ్యాయి. కొందరు కార్యకర్తలు ఆగ్రహంతో కుర్చీలను విరగ్గొట్టగా మరికొందరు వేదిక వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అనూహ్య పరిణామాలతో సభా వేదిక వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. నాయకుల ప్రసంగాలు నిలిచిపోగా కార్యకర్తల నినాదాలతో సమావేశం కొంతసేపు పూర్తిగా అస్తవ్యస్తమైంది. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. ఇదే సమయంలో వేదికపై ఉన్న వనమా రాఘవ తీవ్ర అసంతృప్తితో స్టేజి దిగి వెళ్లిపోవడానికి ప్రయత్నించడం ఉద్రిక్తతను మరింత పెంచింది. రాఘవను వెనక్కి తీసుకురావాలని ఆయన అభిమానులు పట్టుబట్టగా మరోవైపు ఎమ్మెల్సీ రవీందర్ వ్యాఖ్యలను సమర్థించే వర్గం కూడా స్పందించడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి మరింత విషమించకుండా ఉండేందుకు సభకు హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్వయంగా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వేదికపైకి వచ్చి ఇరువర్గాలను శాంతింపజేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే అప్పటికే కార్యకర్తల్లో ఆగ్రహావేశాలు పెరిగిపోవడంతో కొంతసేపు ఆయనకు కూడా పరిస్థితిని అదుపులోకి తేవడం కష్టంగా మారిందని సమావేశానికి హాజరైనవారు చెబుతున్నారు. వనమా రాఘవ అభిమానులు ఎమ్మెల్సీ రవీందర్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బహిరంగంగానే అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న నాయకుడిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడడం సరికాదంటూ నినాదాలు చేశారు. మరోవైపు సమన్వయ కమిటీ సభ్యులను బెదిరించేలా వ్యవహరించవద్దంటూ రవీందర్ చేసిన వ్యాఖ్యలు కూడా వివాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. చివరకు సీనియర్ నాయకుల జోక్యంతో వనమా రాఘవను తిరిగి వేదికపైకి తీసుకువచ్చి సమావేశాన్ని కొనసాగించినప్పటికీ అప్పటికే బీఆర్ఎస్ లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కంటే నేతల మధ్య విభేదాలే చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో పార్టీ పునర్వ్యవస్థీకరణకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో కొత్తగూడెం వేదికగా వెలుగుచూసిన ఈ పరిణామాలు బీఆర్ఎస్ నాయకత్వానికి కొత్త తలనొప్పిగా మారాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పార్టీ ఐక్యతను ప్రదర్శించాల్సిన సమావేశం వర్గపోరు, నినాదాలు, నిరసనలతో ముగియడం జిల్లాలో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

# డ్రైనేజీలపై వ్యాపారాలకు చెక్

- డ్రైనేజీ ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ షాపులు
- దమ్మపేటలో 19 కొత్త షాపుల నిర్మాణానికి శ్రీకారం





**దమ్మపేట, జూన్. 18, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీ స్థలంలో 19 షాపుల నిర్మాణానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పాలకవర్గం తీర్మానం చేసిన నేపథ్యంలో గురువారం భూమిపూజ నిర్వహించి, ఇంజనీర్ ఆధ్వర్యంలో షాపుల నిర్మాణానికి ముగ్గు వేశారు. సుమారు తొమ్మిది సంవత్సరాల క్రితం వరకు ఈ స్థలంలో వారాంతపు సంత నిర్వహించబడేది. అనంతరం సంత కొట్టులు రాజీవ్ గాంధీ సెంటర్ వైపు తరలించడంతో స్థలం ఖాళీగా ఉండిపోయింది. ఇటీవల ఏర్పడిన కొత్త పంచాయతీ పాలకవర్గం ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించి శుభ్రపరిచి, 19 షాపుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో దమ్మపేట ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలపై ఆక్రమణలు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. డ్రైనేజీలపై ఉన్న షాపులను తొలగించాలని సూచించగా, సంబంధిత వ్యాపారులు తమకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని సర్పంచ్ ను కోరినట్లు చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్తగా నిర్మించే 19 షాపులను లాటరీ పద్ధతిలో లీజుకు కేటాయించనున్నట్లు తెలిపారు. లీజు వ్యవధి, నెలవారీ అద్దె, నిర్వహణ నిబంధనలపై త్వరలో స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేస్తామని చెప్పారు. డ్రైనేజీలపై పూర్తిగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 20వ తేదీన దమ్మపేట ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ ఆక్రమణలను జేసీబీ సహాయంతో తొలగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రతి షాపు యజమానికి నోటీసులు ఇచ్చామని, మైక్ ద్వారా ప్రచారం కూడా నిర్వహించామని తెలిపారు. ఇకపై ఎలాంటి గడువు ఇవ్వబోమని, డ్రైనేజీలపై ఉన్న నిర్మాణాలతో పాటు రోడ్డుపైకి వచ్చిన షాపు బోర్డులను కూడా తొలగించాలని సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరేళ్ల నిరీక్షణకు తెర..

(మొదటి పేజీ తరువాయి...)

అక్కడి నివాసితులతో సమావేశమై, ప్రభుత్వం ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న నివాస ప్రాంతాలకు ఎలాంటి చార్జీలు లేకుండా విద్యుత్ లైన్ సదుపాయం కల్పించే అవకాశం ఉందని వివరించారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం మల్లారం శివారులో 20కి పైగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో త్వరలోనే ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతాలకు ఉచితంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమన్నారు. ఇప్పటికే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు దూర ప్రాంతాల ప్రజలకు కూడా ఎలాంటి చార్జీలు లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించడం ప్రజల సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. కిలోమీటర్ పరిధిలో ఉన్న నివాస ప్రాంతాలకు ఉచితంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రూపా రాంబాబు, చిన్నశెట్టి గోపి, అప్పారావు, మళ్ళా చిన్నా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ నెంబర్‌కు కళ్లెం పడేనా..!

- ఇల్లందులో గుట్టుగా కొనసాగుతున్న అక్రమ దందా
- ఒకటికి పది వస్తుందంటూ ఆశల వల
- వ్యసనంగా మారి కుటుంబాలను వీధిన పడేస్తున్న సింగిల్ నెంబర్
- ఏజెంట్ల ద్వారా రోజువారీ వసూళ్లు
- యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారం..?
- పోలీసుల నిఘా పెంచాలని పలువురి అభిప్రాయం

ఇల్లందు, జూన్ 18 (ప్రజా జ్యోతి) ఇల్లందు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సింగిల్ నెంబర్ పేరుతో జరుగుతున్న అక్రమ జూదం ఆందోళనకర స్థాయికి చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదృష్టం కలిసొస్తే రాత్రికి రాత్రే డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో అమాయక ప్రజలను నిర్వాహకులు ఆకర్షిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. ఒకటికి పది రేట్లు వస్తాయని ప్రచారం చేస్తూ పెద్దఎత్తున డబ్బులు సేకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజురోజుకూ ఈ దందా విస్తరిస్తుండటంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

### ఆశలతో మొదలై.. నష్టాలతో ముగుస్తున్న జీవితం

సింగిల్ నెంబర్ ఆడే వారిలో ఎక్కువమంది కూలీలు, చిన్న వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తుంది. కొద్దిపాటి డబ్బుతో ఎక్కువ సంపాదించాలనే ఆశతో ప్రారంభమైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారుతుందని సమాచారం. మొదట్లో చిన్న మొత్తాలతో ఆడిన వారు తర్వాత పెద్ద మొత్తాలు పెట్టి నష్టపోతూ అప్పుల పాలవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని జోరుగా ప్రచారం జరుగుతుంది."ఈసారి తప్పకుండా వస్తుంది", "రేపు గెలుస్తాను" అనే నమ్మకంతో పలువురు తమ సంపాదన మొత్తం పోగొట్టుకుంటున్నారు. ఫలితంగా కుటుంబ అవసరాలు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతుంది. కొందరు అప్పులు చేసి మరీ సింగిల్ నెంబర్‌లో డబ్బులు పెట్టి చివరకు ఆర్థికంగా దెబ్బతింటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

### సింగిల్ నెంబర్‌కు బానిసలవుతున్న వారెందరో

సింగిల్ నెంబర్ ప్రభావం ప్రతి ఒక్క వర్గంపై తీవ్రంగా పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సంపాదించాలనే భావన కంటే సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ పెరుగుతుందని అంటున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో కొందరు యువకులు ఈ దందాలో చిక్కుకొని భవిష్యత్తును పణంగా పెడుతున్నారని సామాజిక వేత్తలు చెబుతున్నారు.యువత, పెద్ద వారిలో పెరుగుతున్న ఈ ధోరణి భవిష్యత్తులో సామాజిక సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

### ఏజెంట్ల ద్వారా పైసల వసూళ్లు?

సింగిల్ నెంబర్ నిర్వాహకులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లకుండా ప్రత్యేక ఏజెంట్లను నియమించి డబ్బులు సేకరిస్తున్నారని సమాచారం. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు రోజూ తిరుగుతూ నెంబర్లు తీసుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవస్థ కారణంగా అసలు నిర్వాహకులు బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారని సమాచారం. ప్రతి రోజూ రూ. లక్షల లావాదేవీలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది

### బయటకు చెప్పుకోలేక మదనపడుతున్న బాధితులు

సింగిల్ నెంబర్ కారణంగా నష్టపోయిన వారిలో చాలామంది తమ బాధను బయటకు చెప్పుకోలేక మౌనంగా కుమిలిపోతున్నారని తెలుస్తుంది. కుటుంబ సభ్యులకు తెలియకుండా డబ్బులు పోగొట్టుకున్న వారు మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు అప్పుల పాలై తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ సామాజిక పరువు భయంతో బయటకు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు.ఇలాంటి పరిస్థితులు కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులకు కారణమవుతున్నాయని సమాచారం.

### ప్రధాన అండలతో సాగుతున్న దందా!

ఈ అక్రమ సింగిల్ నెంబర్ దందా వెనుక కొందరి అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుంది. ఇంత పెద్ద దందా జరుగుతున్నప్పటికి సంబంధిత శాఖ అధికారులకు తెలియక పోవటం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొందరి ఆశ్రయం లేకుండా ఇంత పెద్ద స్థాయిలో ఈ వ్యాపారం సాగడం సాధ్యం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేకపోయినా, ప్రజల్లో మాత్రం పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### పోలీసుల నిఘా తప్పనిసరి

సింగిల్ నెంబర్ దందాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గుట్టుగా నిర్వహిస్తున్న కేంద్రాలను గుర్తించి దాడులు నిర్వహించాలని కోరుతున్నారు. ఏజెంట్ల నుంచి నిర్వాహకుల వరకు అందరిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు.అలాగే ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సింగిల్ నెంబర్ వల్ల కలిగే నష్టాలపై చైతన్యం కల్పించాలని సూచిస్తున్నారు.

### అరికట్టకపోతే మరిన్ని కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం

రోజురోజుకూ విస్తరిస్తున్న సింగిల్ నెంబర్ దందా కారణంగా ఇప్పటికే అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నిఘా పెట్టి నిర్వాహకులు, ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోకపోతే మరింత మంది ఈ వ్యసనానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకునే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా సమాజానికి హాని కరంగా మారుతున్న ఈ అక్రమ దందాపై ఉక్కుపాదం మోపి, ప్రజల కష్టార్జిత ధనాన్ని కాపాడాలని ఇల్లందు ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## ప్రైవేట్ బడి వద్దు... ప్రభుత్వ బడే ముద్దు



ఇల్లందు, జూన్ 18 (ప్రజా జ్యోతి: ప్రైవేట్ బడి వద్దని ప్రభుత్వ బడే ముద్దని విజయలక్ష్మి నగర్, కొమరారం సర్పంచులు చందావత్ రమేష్ బాబు, అజ్మీరా బిచ్చలు అన్నారు. గురువారం మండల పరిధిలోని విజయలక్ష్మి నగర్ పంచాయతీలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అదేవిధంగా కొమరం పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయితే పేదవాడికి విద్య అనేది అందని ద్రాక్ష గానే మిగులుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించే విధంగా ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల టీచర్లచే ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత యూనిఫామ్స్, ఉచిత పుస్తకాలు, ఆటలు సైన్స్ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్ వంటి అధునాతన సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యతరగతి కుటుంబాలు వాడు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో అప్పులు చేసి మరి చదివిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు తీసుకుంటున్న ప్రతి ఒక్కరూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిఎసిఎస్ వైస్ చైర్మన్ పోలపల్లి నాగేశ్వరరావు, జి సుధాకర్, లింగయ్య నాయక్, టీచర్లు కిరణ్, సంగీత, ఉమారాణి, శిరీష, సుజాత, ప్రభుదాస్, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, రాంబాబు, రాజా, నరసింహారావు, విజయ కుమార్, త్రివేణి, మమత, ఉప సర్పంచ్ బుర్రి ప్రవీణ్, వార్డు సభ్యులు మాధవి, దీక్ష భారతి, పంచాయతీ కార్యదర్శి నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ




ఇల్లందు, జూన్ 18 (ప్రజా జ్యోతి) ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం అందజేసే కళ్యాణ లక్ష్మి చెక్కులను గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్ ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. పేదింటి ఆడబిడ్డకు పెళ్లి ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంను వినియోగించుకోవాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్

భద్రాచలం టౌన్, జూన్ 18, (ప్రజాజ్యోతి), విద్యార్థినీ విద్యార్థులు తమ చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగతం చేసుకొని జీవితంలో వినియోగించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆచార్య జాన్ మిల్టన్ విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. గురువారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుబంధ మెంటల్ షిప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం ఐదవ సెమిస్టర్ లో భాగంగా తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్నల్ షిప్ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ శ్రద్ధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్, పరిజ్ఞాన వినియోగంపై విద్యార్థినీ విద్యార్థులకు 18,19 తేదీలలో రెండు రోజులు పాటు శిక్షణ అందిస్తారని, ఈ శిక్షణ తరగతులకు డాక్టర్ బి వి రావు, డాక్టర్ శ్రీలత, రమేష్ లు నోడల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్యూఏసీ కోఆర్డినేటర్ హావిలా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహంతో రాజకీయాలు చేయొద్దు

- అంబేద్కర్ వాదుల సహనాన్ని పరీక్షించొద్దు
- మాలజన సమితి అధ్యక్షులు చెట్టి సురేష్



అశ్వాపురం, జూన్ 18, ప్రజా జ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో మాల జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పినపాక నియోజకవర్గ మాలజన సమితి అధ్యక్షులు చెట్టి సురేష్ మాట్లాడుతూ అశ్వాపురం మెయిన్ రోడ్డు నందు ఎటువంటి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిర్మించుకున్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం దారుణమని, కొందరు అధికారుల అత్యుత్సాహంతో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని కావున తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియ చేశారు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుని విగ్రహం తో రాజకీయాలు చేయొద్దని దళితుల సహనాన్ని చేతకాని తనంగా తీసుకోవద్దని వెంటనే ఎక్కడ నుండి విగ్రహాన్ని తొలగించారో అధికారికంగా పర్మిషన్ ఇచ్చి అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చెట్టి మల్లేష్ మేకల భాస్కర్ జూపల్లి ధ్రువ కుమార్ రావుల అజయ్ చెట్టి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకళ్యాణం

- దేవస్థానం నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం

భద్రాచలం టౌన్, జూన్ 18 ప్రజాజ్యోతి,భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి నిత్యకళ్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకరబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం వైదిక సిబ్బంది నిర్వహించారు. అలాగే దేవస్థానం నిత్యాన్నదాన పథకంకు రూ.లక్ష విరాళంను హైదరాబాద్‌కు చెందిన పూలగుర్తి పద్మావతి అందజేశారు.



## వీరాపురం ఇసుక రీచ్, పోడు భూముల సమస్యలపై మంత్రిని , ఎమ్మెల్సీని కలిసిన ఆదివాసీ నాయకులు





**పినపాక, జూన్ 18(ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులకు సంబంధించిన పలు కీలక సమస్యలపై తుడుం దెబ్బ నాయకులు మంత్రి సీతక్క,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తి రాజు, జాతీయ ఉపాధ్యక్షుడు కోడేం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించి ప్రస్తుతం రెండు గిరిజన సహకార సంఘాల మధ్య కొనసాగుతున్న వివాదాన్ని నిష్పాక్షికంగా పరిష్కరించాలని కోరారు.రెండు ఆదివాసీ సంఘాలకు సమన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం,సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పోడు భూముల సమస్యలు, గిరిజనుల జీవనోపాధి, ఏజెన్సీ ప్రాంతాల్లో వలసల ప్రభావం తదితర అంశాలను మంత్రి,ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు.పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో శ్రీగిరి లక్ష్మి ఇసుక క్వారీ ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు కూడా పాల్గొని వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించిన తమ సమస్యలను వివరించారు.గిరిజన హక్కులు, జీవనోపాధి, పోడు భూముల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారని గిరిజన నాయకులు తెలిపారు.

## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

- **80 కేజీల గంజాయి, కారు స్వాధీనం**




**మణుగూరు, జూన్ 18 (ప్రజాజ్యోతి):** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మణుగూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు మండల పరిధిలోని తోగ్గూడెం వద్ద గురువారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భద్రాచలం నుండి మణుగూరుకు ఫార్చూనర్ కారులో 80 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుండి 80 కేజీల గంజాయితో పాటు ఫార్చూనర్ కారును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. 80 కేజీల గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని చెప్పారు. అక్రమ నిషేధిత గంజాయిని తరలిస్తున్న సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్ లు ఇరువురు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామని తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలియజేశారు. ఈ తనిఖీలలో చాకచక్యంగా వ్యవహరించి,అక్రమ గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకొని స్టేషన్ కు తరలించిన సిఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్, ఎస్సై రఫూఖ్ లు, హెడ్ కానిస్టేబుల్ దామోదర్, కానిస్టేబుల్ మురారి లను అభినందించారు.

# ఫీజుల ఫైర్..!

- **ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారం.. తల్లిదండ్రులపై ఆర్థిక మోత**
- **ఫీజులు కట్టలేక అవస్థలు.. టీసీల కోసం నిరీక్షణ**
- **చిన్నారుల విద్యాభ్యాసానికి అడ్డంకులుగా మారుతున్న బకాయిల వివాదాలు**
- **"బడి బాట" లక్ష్యాలకు విఘాతం కలిగిస్తున్న పరిస్థితులు**
- **ప్రభుత్వ జోక్యాన్ని కోరుతున్న తల్లిదండ్రులు**




**టేకులపల్లి, జూన్ 18,(ప్రజాజ్యోతి):** విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల తీరుపై తల్లిదండ్రుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏడాది పెరుగుతున్న ఫీజులు పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారంగా మారుతున్నాయి. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఆశతో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించిన తల్లిదండ్రులు ఇప్పుడు ఫీజుల భారం మోయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తుండగా, మరికొందరు ఆర్థిక పరిస్థితుల కారణంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు లేదా రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

### ఫీజుల బకాయిల పేరుతో టీసీల నిలుపుదల..?

ప్రాంతంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల బకాయిలను కారణంగా చూపుతూ విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీలు) ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫీజులు పూర్తిగా చెల్లించకపోతే టీసీ ఇవ్వబోమంటూ కొందరు యాజమాన్యాలు తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాల్సిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

### ప్రవేశాలకు అడ్డంకిగా మారుతున్న పరిస్థితులు

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం టీసీలు అవసరమవుతున్న సందర్భాల్లో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ టీసీలు అందకపోవడంతో విద్యార్థుల ప్రవేశ ప్రక్రియ ఆలస్యం అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల చిన్నారుల విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

### "బడి బాట" లక్ష్యాలకు విఘాతం

ప్రతి చిన్నారిని బడిలో చేర్పించి విద్యకు దూరం కాకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం "బడి బాట" కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే టీసీల జాప్యం, అధిక ఫీజుల భారం కారణంగా కొందరు విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థుల ప్రవేశాలకు ఆటంకాలు ఏర్పడటం ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సవాలుగా మారుతోంది.

### నియంత్రణ లేకపోవడమే కారణమా..?

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల విషయంలో స్పష్టమైన నియంత్రణ వ్యవస్థ లేకపోవడం వల్లే యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఫీజులను పెంచుతూ తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఫీజుల నియంత్రణకు కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని, ఫీజుల బకాయిల పేరుతో టీసీలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.టీసీ లేకున్నా విద్యార్థులకు తాత్కాలికంగా ప్రవేశం కల్పించే విధంగా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారుల విద్యకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు


### చిన్నారుల భవిష్యత్తు పణంగా మారొద్దు


విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజుల సమస్యలు, టీసీల వివాదాలు వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం, పాఠశాల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. చిన్నారుల చదువులే దేశ భవిష్యత్తుకు పునాది అనే విషయాన్ని గుర్తించి విద్యా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **వలస గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి**
- **తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు మీడియం బాబురావు**

**పినపాక, జూన్ 18(ప్రజాజ్యోతి)** గిరిజన సమస్యలపై రాజీ లేని పోరాటం కొనసాగించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు మీడియం బాబురావు పిలుపునిచ్చారు. గురువారం పినపాక మండలం ఈ బయ్యారంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మీడియం బాబురావు ముఖ్య అతిథిగా హాజరై గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ, పోడు భూముల అంశాలపై మాట్లాడారు.మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు, మహిళలు, యువకులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.మహాసభకు ముందు సీతారాంపురం గ్రామం నుంచి ఈ బయ్యారం క్రాస్‌రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది గిరిజనులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కొమ్ము నృత్యాలు, జానపద కళారూపాలను ప్రదర్శించారు. డప్పుల మోతలు, సంప్రదాయ గీతాల నడుమ సాగిన ఈ ర్యాలీ స్థానిక ప్రజలను ఆకట్టుకుంది. గిరిజనుల ఐక్యత, సామాజిక చైతన్యాన్ని చాటిచెప్పే విధంగా ర్యాలీ కొనసాగింది.ర్యాలీ అనంతరం ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లోని కొమరం భీం విగ్రహం వద్దకు చేరుకున్న గిరిజనులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన కొమరం భీం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పోరాటాలను కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం దుబ్బ గోవర్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహాసభలో గిరిజనుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. మాట్లాడిన మీడియం బాబురావు రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోడు భూముల సమస్య ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడం వల్ల వేలాది గిరిజన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులకు హక్కు పత్రాలు అందించి భూ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.గిరిజనులు నివసించే ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాల వరకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఆరోగ్య సేవలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. వలస గిరిజనుల సమస్యలపై కూడా మీడియం బాబురావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉపాధి, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన గిరిజనులు తమ గిరిజన హోదాను కోల్పోతున్న దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వారు ఎక్కడ నివసిస్తున్నారనే కారణంతో కుల ధ్రువీకరణ పత్రాలు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అర్హులైన వలస గిరిజనులకు వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గిరిజనుల భూమి, అటవీ, నీటి హక్కులను పరిరక్షించేందుకు సంఘటిత పోరాటాలు అవసరమని మీడియం బాబురావు పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి గిరిజనులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.మహాసభలో గిరిజనుల హక్కుల సాధన, పోడు భూముల సమస్యల పరిష్కారం, వలస గిరిజనులకు న్యాయం కల్పించే అంశాలపై పలు తీర్మానాలు ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా దుబ్బా గోవర్ధన్, మండల కార్యదర్శిగా మడివి రమేష్, తో కూడిన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గౌరీ నాగేశ్వర రావు, కార్యదర్శి కారం పుల్లయ్య,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న, మండల నాయకులు కల్తి నాగేశ్వర రావు, కూరసం లక్ష్మయ్య, నూపా కృష్ణ , వివిధ గ్రామాల ప్రతినిధులు,ఆదివాసి మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా ఉద్దీపకం రూపొందించాలి

**• భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్**



**భద్రాచలం టౌన్, జూన్ 18 ప్రజాజ్యోతి**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం కోసం కనీస సామర్థ్యాలను విద్యార్థుల్లో మెరుగు పరిచి, పిల్లల బేస్ లెవెల్ పునాది గట్టిగా ఉండాలంటే నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఉద్దీపకం వర్క్ బుక్ రూపొందించి అమలు చేయడం వలన విద్యార్థుల విద్యా నైపుణ్యాలు పెరిగి చాలావరకు సత్ఫలితాలు సాధించామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ ప్రాంగణంలోని పిఎంఆర్సిలో ఉపాధ్యాయులతో ఉద్దీపకం వర్క్బుక్ తయారీ ప్రణాళిక గురించి చర్చించడంతో ఉపాటు ఉపాధ్యాయులు రూపొందిస్తున్న అంశాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినందున విద్యార్థులకు కనీస సామర్థ్యాలు అర్థమయ్యే రీతిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే సలహాలు సూచనలు తీసుకొని ఈ ఉద్దీపకం వర్క్ బుక్స్ రూపొందించాలన్నారు. దీని వలన మూడు, నాలుగు, ఐదవ తరగతి పిల్లలకు గుణకాహారాలు, బాగాహారాలు, పిల్లల యొక్క విద్య పరంగా నైపుణ్యాలు కొంతవరకు పిల్లలు అర్థం చేసుకొని సొంతంగా చదవడం రాయడం, వాటి సారాంశాలు విద్యార్థినీ విద్యార్థులు చాలావరకు అర్థం చేసుకోవడం జరుగుతుందన్నారు.అలాగే 01,02 తరగతులకు తెలుగు ఇంగ్లీష్, గణితం కలిపి రూపొందిస్తున్నామని, అలాగే గత సంవత్సరం మూడో తరగతికి మాత్రమే గణితంలోని అంశాలు అర్థం చేసుకునేలా రూపొందించామని కానీ ఈ సంవత్సరం గణితంతో పాటు ఇంగ్లీష్ వర్క్ బుక్ కూడా ప్రత్యేకంగా రూపొందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా నాలుగు, ఐదు తరగతులకు గణితంతో పాటు ఇంగ్లీష్ వర్క్ బుక్ రూపొందించి, విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను పరీక్షించడానికి కొత్తగా కొన్ని పదాలు చేర్చడం జరిగిందని అన్నారు. అదేవిధంగా 7,8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇప్పటినుండే కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన అంశాలు తెలుసుకునేలా బుక్ రూపొందించి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. గిరిజన సంక్షేమశాఖలో పనిచేయుచున్న ఎస్జిటి టీచర్ల ద్వారానే 60 రోజులపాటు నిశితంగా పరిశీలించి వర్క్ బుక్ రూపొందిస్తున్నామని అన్నారు. దీనిలోని అంశాలు చాలా సులభంగా విద్యార్థులు అవగాహన చేసుకునే విధంగా ప్రత్యేకంగా తయారు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ చందన, ఏసిఎంఓ రమేష్, ఏపీఎస్, జిపిఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రాంతిపురంలో బడిబాట కార్యక్రమం



**చర్ల, జూన్ 18(ప్రజా జ్యోతి ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ పరిధిలోని క్రాంతిపురం గ్రామంలో బడికి దూరమైన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.గ్రామంలో 20 మందికి పైగా డ్రాప్అవుట్ (బడికి దూరమైన) విద్యార్థులను గుర్తించిన అధికారులు, వారి తల్లిదండ్రులను నేరుగా కలిసి విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్తు, ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి పిల్లలను తిరిగి బడికి పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎస్–చర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, సుబ్బంపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి, సుబ్బంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకా సత్యనారాయణ, సీఆర్పీ నరేష్ పాల్గొన్నారు. వారు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకాలు ఉన్నాయో తెలుసుకున్నారు.అదేవిధంగా గ్రామ శ్రేయోభిలాషి, వార్డు సభ్యుడు ఆంధ్రయ్యను కలిసి డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు సహకరించాలని కోరారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో విద్యార్థులను సుబ్బంపేట పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులను ఒప్పించారు.ప్రతి బాలబాలిక విద్యకు దూరం కాకుండా చూడటం, పిల్లలందరినీ బడిలో చేర్పించడం బడిబాట కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బడికి దూరమైన విద్యార్థులను గుర్తించి తిరిగి విద్యాభ్యాసంలో భాగస్వాములను చేసేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

## ఘనంగా సామినేని ఉమాదేవి ప్రథమ వర్ధంతి



**భద్రాచలం టౌన్ , జూన్ 18 ప్రజాజ్యోతి ,** భద్రాచలం డివిజన్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ సభ్యులు సామినేని పురుషోత్తం సతీమణి, కీర్తిశేషులు సామినేని ఉమాదేవి ప్రథమ వర్ధంతి కార్యక్రమం గురువారం భద్రాచలంలోని ఐటీడీఏ రోడ్డులో గల శ్రీ బోర్వెల్ రంగారెడ్డి ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమాదేవి చిత్రపటానికి సంఘం అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, కోశాధికారి డి. కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షులు సుబ్బయ్య చౌదరి, సహాధ్యక్షులు ఎస్. రాజబాబులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు, సభ్యులు ఆమె చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాళం సత్యనారాయణ, విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, ఎన్. జగన్మోహనరావు, సూరిశెట్టి కృష్ణ, దుర్గాప్రసాద్, బంధు నరసింహారావు, ఐ.వి. సత్యనారాయణ, తోట కోటేశ్వర రావు, మహాలక్ష్మి , బైరు నరసింహారావు, వి. పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం



**చర్ల, జూన్ 18 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో రైతులకు యూరియా ఎరువుల సరఫరాను మరింత సులభతరం చేయడానికి వ్యవసాయ శాఖ యూరియా బు కింగ్ యాప్ను ప్రారంభించింది అని యూరియా అవసరమైన రైతులు ఈ యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు.యాప్లో ఫోన్ నంబర్ వివరాలు నమోదు కాకపోయిన లేదా అప్డేట్ చేయాల్సిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈవో) సంప్రదించి వివరాలను సరిచేసుకోవాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యూరియా కొరత లేకుండా ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలియచేసారు.

## జూన్ 21 సభ విజయవంతం చేయండి



**చర్ల, జూన్ 18 :(ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయతీలోని ఎదురుగుట్టలలోజూన్ 21న నిర్వహించనున్న ఆదివాసీ హక్కులు, చట్టాల అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఆదివాసీ యువ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు చర్ల మండలంలోని పలు గ్రామాలు, గూడెల్లో గురువారం విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆదివాసీ యువ నాయకుడు పూనెం వరప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసీలు తమ హక్కులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ఏజెన్సీ ప్రాంతంలో తమ హక్కులను కాపాడుకోగలరని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి గూడెం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఉద్యమకారుడు తయారవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.అలాగే ఆదివాసీ మహిళలను అక్రమంగా అరెస్టు చేస్తున్న ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆదివాసీల సంక్షేమం కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్, భోధనెల్లి సర్పంచ్ సింగయ్య, కుర్నాపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతి, పెద్దిపల్లి సర్పంచ్ కణితి రామకృష్ణతో పాటు శ్యామల, తరుణ్, పూనెం రవికిరణ్, ఇర్ప అరుణ్, ఇర్ప సాయి, కోరం వేణు, తాటి శ్రీను, మడప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పులిగుండాలలో బడిబాట ర్యాలీ

**చర్ల, జూన్ 18: (ప్రజా జ్యోతి ):** చర్ల ప్రాజెక్టు పరిధిలోని పులిగుండాల అంగన్వాడి కేంద్రంలో గురువారం "అమ్మ మాట–అంగన్వాడి బడిబాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు చేర్పించి వారి విద్యా, ఆరోగ్యాభివృద్ధికి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. "అమ్మ మాట–అంగన్వాడి బడిబా ట" నినాదాలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్, టీచర్, తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించక పోతే కఠిన చర్యలు

**• జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డా. రవిబాబు నాయక్**



**భద్రాచలం టౌన్, జూన్ 18, ప్రజాజ్యోతి** భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోయినా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డా. రవిబాబు నాయక్ అన్నారు. గురువారం ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల కూడలిగా ఉన్న వైద్యశాలలో సిబ్బంది అంతా బాధ్యతాయుతంగా పని చేసి రోగులకు సేవలందించాలని కోరారు. వైద్యశాలలో వైద్యుల కొరత ఎక్కువగా ఉందని త్వరలోనే వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామని అన్నారు. ఇటీవల భద్రాచలం ఏరియా ఆసుపత్రి పై వస్తున్న ఫిర్యాదులు, చోటుచేసుకుంటున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే వైద్యులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి ఇదే విషయాన్ని వారికి తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో విలేకర్లు వైద్యశాలలో రోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా స్కానింగ్లు ఎక్కువగా బయటకు రాస్తున్నారని తెలపగా మరోసారి ఆ సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే ముందుగా తెలియజేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆసుపత్రి అధికారులకు, సిబ్బంది సహకరించాలని డా.రవిబాబు నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాజశేఖర్ రెడ్డి, ఆర్ ఎంఓలు డా.సంతోష్, డా.మల్లేష్లు పాల్గొన్నారు.

## చలో కొడంగల్ పోస్టర్ ఆవిష్కరణ

- జూలై 1న కొడంగల్‌లో ఎల్ హెచ్ పి ఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ మహాసభ



**టేకులపల్లి, జూన్18,(ప్రజాజ్యోతి):** లంబాడీ హక్కుల పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో "చలో కొడంగల్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా లాలు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 1, 2026న కొడంగల్‌లోని బంజారా భవనంలో నిర్వహించనున్న ఎల్ హెచ్ పి ఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ మహాసభకు లంబాడీ జాతి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. "మా తండాల్లో మా రాజ్యం – మేమెంత మంది మో మాకు అంత వాటా" అనే నినాదంతో లంబాడీ జాతి ఆత్మగౌరవం, హక్కులు, రాజ్యాధికార సాధన కోసం బహుజన విప్లవ కెరటం మారోజు వీరన్న ఆలోచనలతో 1997 జూలై 1న లంబాడీ హక్కుల పోరాట సమితి స్థాపించబడిందని తెలిపారు. నేడు సంస్థ 29 సంవత్సరాల విజయవంతమైన పోరాట ప్రయాణాన్ని పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. కొండలు, కోనలు, అడవుల్లో సామాజిక, ఆర్థిక వివక్షల మధ్య జీవిస్తున్న లంబాడీ జాతికి రాజకీయ చైతన్యం, సామాజిక స్పృహ కల్పించి హక్కుల సాధన దిశగా మార్గనిర్దేశం చేసిన ఉద్యమమే ఎల్ హెచ్ పి ఎస్ అని పేర్కొన్నారు. పోరాట ఫలితంగా 3 వేలకుపైగా తండాలు గ్రామపంచాయతీలుగా ఏర్పాటు కావడం, లంబాడీ జాతి సమస్యలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చర్చకు తీసుకెళ్లడం, తెలంగాణలో రిజర్వేషన్ల పెంపు కోసం ఉద్యమాలు చేపట్టడం వంటి విజయాలు సాధించామని వివరించారు. రానున్న మహాసభలో ఎస్టీలు సాగు చేస్తున్న లావణి, సీలింగ్, పోడు భూములకు పూర్తి హక్కులతో పట్టాలు ఇవ్వాలని, ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన 14 శాతానికి పెంచాలని, లంబాడీ గోర్బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఎస్టీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని, దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రధాన డిమాండ్లుగా ప్రస్తావించారు. లంబాడీ జాతి భవిష్యత్తు, హక్కుల పరిరక్షణ, రాజ్యాధికార సాధన కోసం ప్రతి తండా నుంచి, ప్రతి కుటుంబం నుంచి పెద్ద ఎత్తున కొడంగల్‌కు తరలివచ్చి చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంతుల్య నాయక్, జిల్లా జనరల్ సెక్రటరీ కుశా నాయక్, టేకులపల్లి మండల అధ్యక్షుడు మూడు హుస్సేన్ నాయక్, బోడ మంచా నాయక్, భూక్యా దల్సింగ్ నాయక్, రమేష్ నాయక్, నగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన సెక్రటరీకి ఘన సన్మానం

**చర్ల, జూన్ 18(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో గత రెండేళ్లుగా పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన తోకల సురేష్ సాధారణ బదిలీలో భాగంగా చుంచుపల్లి మండలం పెనుగడప గ్రామ పంచాయతీకి బదిలీ కావడంతో గురువారం చర్ల పంచాయతీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈదయ్య ముఖ్య అతిథిగా పాల్గొని సురేష్ సేవలను కొనియాడారు. తన పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయడంతో పాటు పంచాయతీ అభివృద్ధికి విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప సర్పంచ్, పంచాయతీ సిబ్బంది మాట్లాడుతూ సురేష్ ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేశారని పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లో కూడా ఇదే విధమైన సేవా తపనతో పనిచేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన సురేష్ మాట్లాడుతూ చర్లలో పనిచేసిన కాలంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని, తనపై చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, కార్యదర్శి రాంబాబు, ఎంపీఓ మూర్తి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారు

- రాష్ట్రంలో అవినీతి రహిత పాలన నడుస్తుంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రమంత్రి పొంగులేటి పై కేటీఆర్ విమర్శలు హాస్యాస్పదం
- జూపల్లి రమేష్ మున్సిపల్ వైస్ చైర్మన్
- కేటీఆర్‌పై మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ ధ్వజం



**అశ్వారావుపేట, జూన్ 18, (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అవినీతి రహిత, పారదర్శక పాలన సాగుతుంటే, దానిని ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య విమర్శలు చేస్తున్నాయని అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలు అత్యంత హాస్యాస్పదంగా ఉన్నాయని కొట్టిపారేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేటీఆర్ ఇప్పుడు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, అవినీతికి తావులేకుండా పాలిస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటిల ప్రజాదరణను చూసి ఓర్వలేకనే కేటీఆర్ ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారు. నాదర్ గుల్ భూముల పై విమర్శలు చేస్తున్న పార్టీలే గతంలో తమ పాలనలో ఆ భూములకు సంబంధించిన లావాదేవీలు జరిగాయని వాటిని బయట పెట్టడంతోనే తట్టుకోలేక రాజకీయ గ్రామాలకు తెర తీశారన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వంటి సంక్షేమ పథకాలతో పాటు జరుగుతున్న అభివృద్ధిని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు అనవసర విమర్శలు మానుకుని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు సహకరించాలని, రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, కేటీఆర్ మాటలను ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, పార్టీ జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, లక్ష్మీనారాయణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బంజారాలకు దక్కిన గౌరవం

- మార్కెట్ కమిటీ నియామకాలపై హర్షం
- నూతన చైర్మన్, డైరెక్టర్లకు ఘన సన్మానం





**లక్ష్మీదేవిపల్లి, జూన్ 18 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన చైర్మన్, డైరెక్టర్లను నియమించడం పట్ల బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్‌తో పాటు డైరెక్టర్లు మాళోత్ అశోక్ బాబు, అజ్మీరా అము నాయక్, తేజావత్ రవికుమార్, ఇస్లావత్ హరిలాల్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో బంజారా సంఘాల జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ వీరు నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది బంజారాలు నివసిస్తున్నారని వారిలో అత్యధికులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీకి కాంగ్రెస్ ప్రభుత్వం నూతన కమిటీని నియమించడం శుభపరిణామమని అన్నారు. జిల్లాలో నామినేటెడ్ పదవులకు బంజారా సమాజానికి చెందిన నాయకులను ఎంపిక చేయడం పట్ల యావత్ బంజారా సమాజం ఆనందం వ్యక్తం చేస్తోందన్నారు. ఈ నియామకాలు బంజారా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపాయని ప్రభుత్వంపై మరింత విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. జిల్లాలో బంజారా సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమ ఉనికిని చాటుకునే అవకాశాలు పరిమితమయ్యాయని అలాంటి సమయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించడం అభినందనీయమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో వేలాది మంది బంజారా రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి ప్రాతినిధ్యం వహించేలా బంజారా నాయకులకు బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన బానోత్ లాల్‌సింగ్ రైతుల సమస్యలను అర్థం చేసుకుని అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ నియామకాలకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ బంజారా సమాజానికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్, భారతీయ బోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు భట్టు హుస్సేన్ నాయక్, సేవాలాల్ సేన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ నాయక్, ఏజెన్సీ పరిరక్షణ జిల్లా కార్యదర్శి వేణు, హతీరాం, గణేష్, మాళోత్ శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పొంగులేటిపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంది: పర్సా వెంకట్

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 18 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్సా వెంకట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా పర్సా వెంకట్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పాలనను తిరస్కరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ముందుకు సాగుతుండటంతో ఆ పార్టీ నాయకులు అసహనానికి గురవుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొత్తగూడెంలో ప్రెస్ క్లబ్‌కు శ్రీకారం

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే కూనంనేని
- ఇండ్ల స్థలాల అంశాన్ని పలుమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడి



**కొత్తగూడెం, జూన్ 18 ( ప్రజాజ్యోతి )** జర్నలిస్టుల ఐక్యతకు, వృత్తి అభివృద్ధికి వేదికగా నిలిచే కొత్తగూడెం ప్రెస్ క్లబ్‌ను గురువారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. కొత్తగూడెంలో జర్నలిస్టుల కోసం కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించకుండా కాపాడుతున్నామని పేర్కొన్నారు. సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. నగరంలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశం చాలాకాలంగా పెండింగ్‌లో ఉందని ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు కృషి చేసిన జర్నలిస్టులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పోతు రాజేందర్, లోగాని శ్రీనివాస్, ఇమంది ఉదయ్ కుమార్, యెర్రా ఈశ్వర్, జునుమాల రమేష్, కల్లోజి శ్రీనివాస్, మోటమర్రి రామకృష్ణ, ప్రజాజ్యోతి కుమార్, శంకర్, లక్ష్మణ్, చదలవాడ సూరి, అఫ్జల్ పఠాన్, కృష్ణ గోవింద్, కాగితపు వెంకటేశ్వర్లు, నర్సింహ్మా, పండుగ రేశ్వంత్, రవి, రాజేశ్, నాగాచారి, భాస్కర్, సురేష్, పూర్ణ, పాపారావు, కృష్ణారావు, సుధాకర్, శ్రీనివాస్, షఫి, ఉమాకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యాభివృద్ధికి పంచాయతీ పూర్తి సహకారం



**బూర్గంపహాడ్, జూన్ 18 (ప్రజా జ్యోతి ):** విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇరవెండి పంచాయతీ పూర్తి సహకారం ఉంటుందని పంచాయతీ సర్పంచ్ గుండి బాబూరావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థికి ఏ అవసరం ఉన్నా పంచాయతీ నుంచి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు గుగులోతు దుర్గ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీల్లో చిక్కిన గంజాయి రవాణా

- రూ.44.29 లక్షల విలువైన 88.590 కిలోల గంజాయి స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. కారు, సెల్ ఫోన్ స్వాధీనం






**అన్నపురెడ్డిపల్లి, జూన్ 18 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం ఎక్స్ రోడ్డు వద్ద గురువారం ఉదయం 11 గంటల సమయంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్నపురెడ్డిపల్లి పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో ఈ పట్టివేత జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి కేరళ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గుర్తించి వాహనాన్ని తనిఖీ చేయగా 88.590 కిలోల గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.44,29,500గా అధికారులు అంచనా వేశారు. గంజాయితో పాటు ఒక కారు, ఒక సెల్ ఫోన్ ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కేరళ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ రిషాద్ చెరియాండి, షిరాజ్ కుంజివీటిల్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో సంబంధం ఉన్న మరికొంత మంది వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు. సమావేశంలో జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి , అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి పాల్గొన్నారు. గంజాయి పట్టివేతకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను ఫోటోలతో సహా మీడియాకు వివరించారు. నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని డీఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, అన్నపురెడ్డిపల్లి పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

# ఘనంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ వేడుక

- విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేసిన అతిథులు



**కొత్తగూడెం, జూన్ 18 ( ప్రజాజ్యోతి )** ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డబ్ల్యూకేఎఫ్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అకాడమీ మాస్టర్ కోనే సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎసప ీఫ్ అసిస్టెంట్ కమాండర్ చంద్రశేఖర్, సీఐ కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్లు అందజేశారు. యెల్లో బెల్ట్‌ను జెస్సీ, హ్యారీ అందుకోగా, గ్రీన్ బెల్ట్‌ను మనుశ్రీ సాధించింది. అలాగే అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న దితికా శ్రీని ప్రత్యేకంగా సన్మానించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఆత్మరక్షణ విద్యను అలవర్చుకోవాలని అతిథులు సూచించారు. కరాటే ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి అకాడమీకి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సీనియర్ విద్యార్థులు హర్షిక, నీహాశ్రీ, హేమ విశేష సహకారం అందించారు. మీడియా, నిర్వహణ పరమైన ఏర్పాట్లలో రవికుమార్ సహకరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.


# వన్యప్రాణుల వేటకు కుట్ర

- ఫారెస్ట్ అధికారులను చూసి పరుగు.. చివరకు చిక్కిన వేటగాళ్లు





**దమ్మపేట, జూన్. 18, (ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి బీట్ అటవీ ప్రాంతంలో అక్రమ వేటకు వచ్చిన నలుగురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. బీట్ ఆఫీసర్ భవాని తన సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు నాటు తుపాకీతో సంచరిస్తూ అధికారులకు కనిపించారు. అధికారులను గమనించిన నిందితులు రెండు ద్విచక్ర వాహనాలు, ఒక నాటు తుపాకీ, ఆరు తూటాలు, టార్చి, బ్యాగ్‌ను అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే అటవీ శాఖ సిబ్బంది వెంటాడి వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన చిలక వెంకటేష్ (ఏ–1), కీసర్ శివాజీ గణేష్ (ఏ–2), దమ్మపేట మండలం మొండివర్రె కాలనీకి చెందిన దుంప నితిన్ (ఏ–3), ధారబోయిన నాగేశ్వరరావు (ఏ–4) ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక నాటు తుపాకీ, ఆరు తూటాలు, రెండు ద్విచక్ర వాహనాలు, టార్చి లైట్, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నలుగురిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దమ్మపేట కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన దమ్మపేట న్యాయమూర్తి నలుగురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వారిని సత్తుపల్లి సబ్‌జైలుకు తరలించినట్లు రేంజర్ శ్రీనివాసరావు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.




- కేసు నమోదై నెల రోజులు గడుస్తున్నా చర్యలు ఎక్కడ..?
- మైనర్ బాలికకు న్యాయం చేయడంలో జాప్యంపై ప్రశ్నలు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడనే ఆరోపణలు
- బాధిత కుటుంబం ఆవేదన.. అధికారుల తీరుపై అసంతృప్తి
- దర్యాప్తులో రాజకీయ నాయకుల ఎంట్రీపై కొత్త అనుమానాలు

# ఫోక్సో కేసులో... జాప్యం ఎందుకు..?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో నమోదైన ఫోక్సో కేసు వ్యవహారం రోజురోజుకూ మరింత చర్చనీయాంశంగా మారుతోంది. మైనర్ బాలిక పట్ల ఒక సూపర్ మార్కెట్ యజమాని అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణలపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినప్పటికీ నెల రోజులు గడుస్తున్నా దర్యాప్తు పురోగతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై తీసుకున్న చర్యల విషయంలో స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఘటన అనంతరం వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు అందజేశారు. కేసు నమోదు అయినప్పటికీ ఆ తర్వాత దర్యాప్తు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసులో కూడా ఇప్పటి వరకు స్పష్టమైన ఫలితాలు కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.**

● కొత్తగూడెం / పాల్వంచ, ప్రజాజ్యోతి

### ♦ ఫోక్సో కేసా... లేక సాధారణ ఫిర్యాదా..?

పిల్లలపై లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యతతో విచారించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉంటుంది. కానీ పాల్వంచ ఘటనలో మాత్రం ఆ అత్యవసరత కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదై నెల రోజులు దాటుతున్నా ఇప్పటికీ ఫలితం లేకపోవడం సాధారణ విషయం కాదని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. చట్టం కఠినంగా ఉన్నా అమలులో అదే కఠినత్వం కనిపించకపోతే బాధితులకు న్యాయం ఎలా దక్కుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ♦ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్వేచ్ఛగా... బాధితులు భయాందోళనల్లో..?

బాధిత కుటుంబ సభ్యుల వాదన ప్రకారం తమ కుమార్తె పట్ల అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపిస్తున్న వ్యక్తి ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్నాడని చెబుతున్నారు. ఈ పరిస్థితి కుటుంబంలో మరింత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు. ఒక వైపు కేసు నమోదైందనే నమ్మకంతో పోలీసులను ఆశ్రయించిన కుటుంబం... మరోవైపు కేసు ముందుకు కదలడం లేదనే భావనతో నిరాశ చెందుతోందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ఆలస్యం కావడం వల్ల బాధిత కుటుంబంలో భయం పెరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ♦ ప్రశ్నిస్తే సమాధానం కాదు... వ్యంగ్యమా..?

ఫోక్సో కేసు దర్యాప్తు పురోగతి గురించి తెలుసుకునేందుకు బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రయత్నిస్తున్నప్పటికీ స్పష్టమైన సమాచారం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనర్ బాలికకు సంబంధించిన సున్నితమైన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశంపై సందేహాలు కొనసాగుతుండగా సమాధానాల కంటే ప్రశ్నలే ఎక్కువగా మిగులుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. దర్యాప్తు ఏ దశలో ఉంది..? ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అదుపులో ఉన్నాడా..? లేక పరారీలో ఉన్నాడా..? బాధిత కుటుంబానికి భరోసా కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..? అనే ప్రశ్నలకు అధికారికంగా స్పష్టత రావాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.

### ♦ దర్యాప్తులో రాజకీయ నాయకుల ఎంట్రీ ఎందుకు..?

ఈ కేసులో తాజాగా మరో అంశం స్థానికంగా చర్చకు దారితీసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోలీసు అధికారులు నిర్వహించిన విచారణలో భాగంగా కొంతమంది రాజకీయ నాయకులు కూడా అధికారులతో కలిసి బాధిత మహిళ ఇంటికి వెళ్లినట్లు సమాచారం. సాధారణంగా ఫోక్సో కేసుల దర్యాప్తు పూర్తిగా చట్టపరమైన ప్రక్రియల ప్రకారమే జరగాల్సి ఉంటుంది. అలాంటి అత్యంత సున్నితమైన కేసులో రాజకీయ నాయకుల ప్రమేయం లేదా వారి హాజరు ఎందుకు అవసరమైందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విచారణ ప్రక్రియలో వారు ఏ హోదాలో పాల్గొన్నారు..? అధికారికంగా వారిని తీసుకెళ్లారా..? లేక స్థానిక స్థాయిలోనే ఈ పరిస్థితి ఏర్పడిందా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. బాధిత కుటుంబం గోప్యత, బాలిక హక్కుల పరిరక్షణ వంటి అంశాల నేపథ్యంలో ఈ పరిణామం మరిన్ని సందేహాలకు తావిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### ♦ చట్టం అందరికీ సమానమే అయితే... ఇక్కడ జాప్యం ఎందుకు..?

సాధారణ కేసుల నుంచి ప్రముఖుల కుటుంబాలకు సంబంధించిన కేసుల వరకు ఎక్కడైనా చట్టం ఒకే విధంగా అమలుకావాలని ప్రజలు ఆశిస్తారు. అలాంటి సమయంలో పాల్వంచలో నమోదైన ఈ కేసు విషయంలో నెల రోజులుగా స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అనుమానాలకు కారణమవుతోంది. దర్యాప్తు జరుగుతోంది అనే ఒక్క మాటతో బాధిత కుటుంబాన్ని నిరీక్షింపజేయడం సరిపోదని కేసు ఎక్కడ ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ♦ బాధితురాలు మైనర్... మరి అత్యవసరత ఎక్కడ..?

ఫోక్సో చట్టం రూపొందించడంలో ప్రధాన ఉద్దేశం పిల్లలకు తక్షణ రక్షణ కల్పించడం, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై వేగంగా చర్యలు తీసుకోవడం. అలాంటి చట్టం కింద కేసు నమోదై కూడా నెల రోజుల తర్వాత అదే ప్రశ్నలు మిగిలి ఉంటే చట్టం అమలు తీరుపై విమర్శలు రావడం సహజమే. బాలిక భద్రత, కుటుంబానికి భరోసా, కేసు పురోగతి... ఈ మూడు అంశాల్లోనూ ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం స్థానికంగా చర్చకు దారితీసింది. ఫోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో ప్రతి రోజు కీలకమేనని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అలాంటి కేసులో బాధిత కుటుంబం ఇప్పటికీ సమాధానాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై తీసుకున్న చర్యలు, దర్యాప్తు ప్రస్తుత స్థితి, బాధిత కుటుంబానికి అందిస్తున్న రక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

### ♦ ఈ కేసుపై ఎందుకు అంత స్పెషల్ ఇంట్రెస్ట్..? : ఎస్ఐ

గత నెలలో నమోదైన ఫోక్సో కేసులో జాప్యం జరుగుతోందని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అదుపులో ఉన్నాడా..? అనే అంశాలపై ప్రజాజ్యోతి ప్రతినిధి పాల్వంచ ఎస్ ఐను ఫోన్ ద్వారా సంప్రదించి వివరణ కోరగా కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని తెలిపారు. కేసు ఇన్వెస్టిగేషన్ లో ఉంది. దర్యాప్తు జరుగుతోంది. ఫోక్సో కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించలేమని ఎస్ ఐ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి నెల ఫోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, రేప్ కేసులు, వందల సంఖ్యలో ఇతర కేసులు నమోదవుతుంటాయి. వాటి గురించి కాకుండా ఈ కేసుపై ఎందుకు అంత స్పెషల్ ఇంట్రెస్ట్..? అంటూ సమాధానం ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఒక పత్రిక ప్రతినిధి అడిగిన ప్రశ్నలకు ఇలాంటి సమాధానం వస్తే బాధిత కుటుంబ సభ్యులు అధికారులను ఆశ్రయించినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారనే చర్చ స్థానికంగా జరుగుతోంది. మైనర్ బాలికకు సంబంధించిన ఫోక్సో కేసు విషయంలో దర్యాప్తు పురోగతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చర్యల గురించి వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో అడిగిన ప్రశ్నలకు ఈ విధంగా స్పందించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

### ♦ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలన్న డిమాండ్

ఈ కేసుపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా సమీక్ష నిర్వహించాలని దర్యాప్తు పురోగతిని బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని మహిళా సంఘాలు, సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఫోక్సో కేసులో జాప్యానికి కారణాలేమిటి..? ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చర్యలు ఎక్కడ..? దర్యాప్తులో రాజకీయ నాయకుల పాత్ర ఏమిటి..? బాధిత కుటుంబానికి భరోసా ఎప్పుడు..? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



